క్లుప్తంగా

చిన్నారులు సృజనాత్మకత కలిగి ఉండాలి



చదరంగం ఆడుతున్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: చిన్నారులు చదువుతో పాటు సృజనాత్మకత కూడా కలిగి ఉండాలని బలగ గ్రంథాలయశాఖ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. నగరంలోని బలగ హడ్కోకాలనీలో గల గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం పిల్లలకు నీతి కథలు, పద్యాలు చెప్పారు. అనంతరం చదరంగం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. చదరంగం, క్యారమ్స్ తదితర ఆటల వలన పిల్లల్లో మేధస్సు పెరుగుతోందన్నారు. సహాయకురాలు కె.అనిత ఉన్నారు.

అన్నపూర్ణ సేవకు రూ.10 వేల విరాళం




విరాళం అదిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి చిలకపాలెం గ్రామానికి చెందిన పాట్నూరు జయలక్ష్మి తన భర్త వరప్రసాద్ జ్ఞాపకార్థం రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని లోలుగు నూకరాజు ద్వారా అన్నపూర్ణ పథకం కార్యదర్శి కిల్లాన ఫాల్గుణరావుకు బుధవారం అందచేశారు. విరాళం అందించినందుకు సంఘం అధ్యక్షులు గంగుల రమణబాబు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావులు ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు తాళ్లపాక జయంతోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: తాళ్లపాక అన్నమాచార్య జయంతోత్సవాలను గురువారం నగరంలోని పలు చోట్ల నిర్వహించనున్నారు. వాడడకు చెందిన తరిణి కృష్ణ స్మారక సేవా ట్రస్టు, శృతిలయ సంగీత శిక్షణాలయం సంయుక్త నిర్వహణలో అన్నమాచార్య 616వ జయంతి వేడుకలను స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ మొదటి అంతస్తులో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మండ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కత్తెరవీధిలోని రాజరాజేశ్వరీదేవి పీఠంలో పౌర్ణమి సందర్భంగా శ్యామావార్తాలి సమేత రాజరాజేశ్వరీ దేవికి శ్రీచక్ర లఘు నవావరణ పూజ, అలాగే తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ తెలిపారు. డీసీసీబీ కాలనీలోని శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కూడా అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని సంకీర్తనాగానం సాయంత్రం ఐదు గంటలకు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు బిర్లంగి రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవాణి సంగీత కళాక్షేత్రం నిర్వాహకులు దుంపల ఈశ్వరరావు ఆధ్వర్యంలో నాదార్చనను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విత్తనాలు, ఎరువులు సిద్ధం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నామని మండల వ్యవసాయాధికారిణి ఉషాకుమారి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కనకేశ్వరరావు మాట్లాడుతూ.. మండలంలోని 23 పంచాయతీల్లో జలజీవన్ మిషన్ ఫేజ్–2 టెండర్లు వేశామన్నారు. నీటి ఎద్దడి గ్రామాలు లేవని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ అంబటి నిర్మల, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మూకాళ్ల తాతబాబు, ఎంపీడీవో సతీష్ పాల్గొన్నారు.

కామేశ్వరితల్లి పండుగ ప్రారంభం



కలశంతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయం వద్దగల కామేశ్వరీ తల్లి అమ్మవారి పండుగలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ముందుగా కలశారాధన కార్యక్రమంలో భాగంగా నాగావళి నదికి వెళ్లి కలశాన్ని సిద్ధం చేసి ఊరేగింపుగా ఆలయం వరకు సాగింది. అనంతరం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• అయ్యప్పస్వామికి పూజలు



శ్రీకాకుళం పట్టణం బలగలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు ఉన్నారు. అలాగే పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలో అయ్యప్పస్వామి ఆలయంలో అభిషేకాలు బుధవారం చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

• నమ్మాళ్వార్‌కు అభిషేకాలు



నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో నమ్మాళ్వార్ తిరునక్షత్ర పూజలు బుధవారం నిర్వహించారు.

అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా భక్తులు పాలను తీసుకొని వచ్చి సమర్పించగా వాటిని నమ్మాళ్వార్‌కు అభిషేకం, పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయం వద్ద భక్తులు, పాదచారులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు.

–శ్రీకాకుళం కల్చరల్

• భక్తితో నృసింహ జయంతి



శ్రీకూర్మనాథాలయంలో బుధవారం వైశాఖ చతుర్థశి సందర్భంగా నృసింహాజయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బేడా మంటపంలో అర్చకులు నృసింహాస్వామి మూర్తిని వేంచిపంజేసి పవిత్ర జలాలతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, దాసుబాబు, కిశోర్‌బాబు, శ్రీనివాసశర్మ ఉన్నారు.

–గార

శ్రీకూర్మనాథాలయంలో ‘పండిత గోష్టి’



పండిత గోష్టి నిర్వహిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం పండిత గోష్టి నిర్వహించారు. ఆలయ అనివిశెట్టి మంటపంలోకి స్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వాముల ఉత్సవమూర్తులను వేంచింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు వేదాలను విన్నపించారు. ఈవో జి.గురునాథం పండితులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, దాసుబాబు, కిశోర్‌బాబు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్‌గా రవికుమార్



పొన్నాడ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్ నియమితులయ్యారు. 2024–2025 సంవత్సరానికిగాను 316 ఏ గవర్నర్ ఎస్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్ నేతృత్వంలో ఈయన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. సభ్యుల అందరి సహకారంతోనే చైర్మన్ పదవి దక్కిందన్నారు. 2019లో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యునిగా ప్రస్థానం ప్రారంభించిన తర్వాత క్లబ్ ట్రెజరర్‌గా, సెక్రటరీగా, క్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా సేవలు అందించినట్టు చెప్పారు. 2023–24 కాలానికి క్లబ్ ప్రెసిడెంట్‌గా జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలతోపాటు, ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం వచ్చిందన్నారు. తాను చేసిన సేవా కార్యక్రమాలు గుర్తించిన క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ లయన్స్‌క్లబ్ గవర్నర్‌కు సిఫార్సు చేసి జోన్ చైర్మన్‌గా చేసినందులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రవికుమార్‌ను డాక్టర్ బి.దేవభూషణరావు, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ పైడి సింధూర, సభ్యులు ఉర్లం శివతేజ తదితరులు అభినందించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



కొండములగాంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది

రణస్థలం: నేలలోని లభ్య పోషకాలను గుర్తించి అందుకు అనుగుణంగా పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని కొండములగాం గ్రామానికి చెందిన రెడ్డి చిన్నంనాయుడు పొలంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడటం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి, నేల సారవంతం కోల్పోయి కాలుష్యానికి గురవుతోందన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి చౌడు గుణాలు, ఎక్కువ సున్నం కలిగిన గుణాల్ని తెలుసుకుని తద్వారా ఎరువుల యాజమాన్య పద్ధతులు చేపట్టడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వాతావరణ కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నేలలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచడానికి సుమారు ఆరువేల ఎకరాలకు సరిపడా అపరాల విత్తనాలు, జీవన ఎరువులు, బయోచార్ వంటి సేంద్రియ కర్బన ఎరువులను అందించామని వివరించారు. గత ఏడాది 13 మండలాల్లోని రెండు వేల ఎకరాల్లో మట్టి నమూనాలు సేకరించి హైదరాబాద్‌లో గల అంతర్జాతీయ మెట్ట ప్రాంత పంటల పరిశోధనా సంస్థ(ఇక్రిశాట్) పరిశీలన చేపట్టి సంబంధిత కార్డులను ఉచితంగా రైతులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సిబ్బంది వై.లహరి, రావాడ కృష్ణ, పిషిణి రమ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో భూసారం



మాట్లాడుతున్న నైర కళాశాల డీన్ భరతలక్ష్మి

శ్రీకాకుళం రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా భూసారం పెంపొందించుకోవచ్చని నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి అన్నారు. బుధవారం వెంకటాపురంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వినియోగించి సాగు చేయడం ద్వారా నాణ్యమైన ఆహారం పొందవచ్చన్నారు. అనంతరం రాగోలు పరిశోధన స్థానం శాస్త్రవేత్త కె.మధుకుమార్ వరి పంట దశలు, కీలకమైన వంగడాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జి.చిట్టిబాబు, జె.జగన్నాథం, సమన్వయకర్తలు బి.జ్యోతిబసు, ఎం.లక్ష్మీదుర్గా, శ్రీపురుషోత్తం, నైరా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం నైరా కళాశాలలో హాస్టల్ 35వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థి, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా డివిజనల్ ఫారెస్ట్ అధికారి ప్రతాప్ మాట్లాడుతూ విద్యార్థి దశలో వసతి గృహం కీలకమన్నారు. పూర్వ విద్యార్థి సూరిబాబు మాట్లాడుతూ లక్ష్య సాధనలో వెనుకడుగు వేయకుండా శ్రమించాలన్నారు.

‘గరిష్ట వేతనం పొందాలి’



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

నరసన్నపేట:

ఉపాధి వేతనదారులు గరిష్ట వేతనం పొందేవిధంగా పనిచేయాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మండలంలోని జమ్ము పంచాయతీ పొన్నానపేట చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గరిష్ట వేతనం రూ.300లకు పెంచిందని, ఈ మొత్తం పొందితే గిట్టుబాటు అవుతుందన్నారు. రైతు పని, ఉపాధి పని ఒకేలా చేయాలని కోరారు. అలాగే ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేయడం మంచిదన్నారు. అంతకుముందు స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొలతలు సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డు అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఆయనతో పాటు ఏపీవో యుగంధర్ ఉన్నారు.

ముత్యాలమ్మతల్లికి స్వరనీరాజనం



స్వరనీరాజనం చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధి గ్రామదేవత ముత్యాలమ్మతల్లి పండుగల సందర్భంగా బుధవారం సాయంత్రం స్వర నీరాజన కార్యక్రమం జరిగింది. కత్తెరవీధి రాజరాజేశ్వరీ సంగీత పీఠం నిర్వాహకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ ఆధ్వర్యంలో చిన్నారులచే స్వరనీరాజన చేశారు. పలు భక్తిగీతాలను ఆలపించారు. ముందుగా అమ్మవారి ఘటాలను వీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో దమ్మల పూజారులు, కమిటీ సభ్యులు ఉన్నారు.

నృసింహస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో నృసింహస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో బుధవారం సాయంత్రం నృసింహ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు నిర్వహణలో నృసింహ స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు.స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవీపీఠంలో పూజలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ మాహాత్రిపుర సుందరి దేవీ పీఠంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జగద్గురు శంకరాచార్య జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న నవ చండీయాగ అంతర్గత చండీహోమం పూర్ణాహుతి జరిగింది. పీఠం నిర్వాహకులు పెంటరామచంద్రశేఖరశర్మ నిర్వహణలో వేదపారాయణలు జరిగాయి

భక్తిశ్రద్ధలతో హనుమంత వాహన సేవ



హనుమంత వాహనసేవ నిర్వహణ

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమంత వాహన సేవ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆలయం వద్ద నుంచి స్వామివారిని హనుమంత వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తప్పెటగుళ్లు, కోలాటం, అష్టలక్ష్మిల వేషధారణల్లో మహిళలు అలరించారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణమాచార్యులు, బ్రహ్మోత్సవాల కమిటీ ప్రతినిధులు జోష్యుల జగన్నాథశర్మ, మావుడూరి జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారు

• ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం:

సార్వత్రిక ఎన్నికలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా సైనికులా పని చేశారని, ఫలితాల్లో భారీ మెజారిటీ రావడం ఖాయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గడబపాలేం, ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన గ్రామదేవత పండగలు సందర్భంగా కార్యకర్తలతో బుధవారం ముచ్చటించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేశారని కొనియాడారు. ఆయనతో పాటు డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, ఇస్రో ఫౌండేషన్ చైర్మన్ యడ్ల గౌరినాయుడు, నాయకులు ముగడ సూర్యనారాయణ, ముగడ లక్ష్మం, అసినాయుడు, సింహాచలం, ఎల్సీ గణపతి, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చిన్నంనాయుడును పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు డోల చిన్నంనాయుడు(పెద్దయ్య) భార్య శ్రీరాములు ఇటీవల మృతి చెందింది. దీంతో ఆయనను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, విశ్రాంత ఉపాధ్యాయుడు భూపతి వెంకట రమణమూర్తి న్యాయవాదులు డోల కిరణ్‌కుమార్, నక్క ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: శంకరరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు ఇటీవల కంటికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీంతో ఆయనను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆర్వో ఎస్‌వీ లక్ష్మణమూర్తి

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు చేపడుతున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎచ్చెర్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్‌వీ లక్ష్మణమూర్తి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కౌంటింగ్ సమయంలో ఏజెంట్ల నియమాకం, ఏర్పాట్లు, హాల్‌లో ఏజెంట్ల ప్రవర్తన నియమావళి వంటి పలు అంశాలపై చర్చించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సమయంలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. కౌటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు చేపట్టాల్సిన పనులు, సమయపాలన వంటి పలు అంశాలపై సూచనలు చేశారు. సమావేశంలో ఎలక్షన్ డీటీ హేమసుందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు అరుదైన గౌరవం



సమావేశమైన క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: హర్షవల్లి లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సేవలకు మెచ్చిన 316ఏ లయన్స్ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా హారికా ప్రసాద్ (కె.ఎ న్.ఎస్.వి.ప్రసాద్), జోనల్ చైర్మన్‌గా ప్రస్తుత అధ్యక్షులు శోభారాణి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం జరిగిన 2024–25 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గం ఎన్నిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపిక చేశారు. అధ్యక్షులుగా వావిలపల్లి జగన్నాథం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ చైర్మన్ హోదాలో హారికా ప్రసాద్ మాట్లాడుతూ.. సేవా రంగంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఒకే క్లబ్‌కు రెండు పదవులు దక్కడం హర్షణీయమన్నారు. ఇందుకు లయన్స్ ఇంటర్నేషనల్ 316ఏ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జోన్ చైర్మన్ కరణం శోభారాణి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షులుగా వి.జగన్నాథంనాయుడు, కార్యదర్శిగా మణిశర్మ, కోశాధికారిగా లక్ష్మీకాంత్, ఉపాధ్యక్షులుగా తర్లాడ అప్పలనాయడు, పాలిశెట్టి మధుబాబు, కార్యవర్గ సభ్యులుగా కె.ఉషారాణి, చింతాడ శిరీష, ఎ.వెంకునాయుడు, మజ్జి సుమన్ ఎన్నికయ్యారు.